క్లుప్తంగా

అంబేడ్కర్‌ను అవమానించినా చర్యలు లేవా?



అర్ధవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో దళిత నేతల నిరసన

గణపవరం: ఉండి నియోజకవర్గం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని స్వయంగా పీకివేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ గణపవరం మండల కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళిత సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేవీపీఎస్ నాయకుడు చిన్నం నాగేశ్వరరావు అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం దారుణమని, ప్రభుత్వం ఈవిషయంలో వెంటనే స్పందించి ఎమ్మెల్యేపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బల్లారపు అశోక్, చిన్నం సుబ్బయ్య, మాదాసి జీవన్, మీసాల శ్రీను, మాణిక్యం పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు



దెందులూరులో కనకదుర్గమ్మ ఆలయం

దెందులూరు: దసరా ఉత్సవాలకు గ్రామ గ్రామాన ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అన్ని గ్రామాల్లో కనకదుర్గమ్మ, మహాలక్ష్మి దేవాలయాలు ముస్తాబమవుతున్నాయి. ఆలయాల లోపల, బయట వివిధ రంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ బల్బులు, గుడి ఎదుట చలువ పందిళ్ల, అలంకరణ ఏర్పాటు చేస్తున్నారు. అన్ని దేవాలయాల్లో ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ బాధ్యులు, యువత, అర్చకులు కృషి చేస్తున్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో పత్తేపురం విద్యార్థినుల ప్రతిభ



జి.కీర్తన (వ్యాసరచనలో ప్రథమ స్థానం)



లిఖిత (వకృత్వ పోటీలో తృతీయ స్థానం)

నిడమర్రు: స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ఏలూరులో జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వం పోటీల్లో పత్తేపురం మూర్తిరాజు జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఎంఈవో పుచ్చల శేషు తెలిపారు. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గునుగొండ కీర్తన ప్రథమస్థానంలో, వకృత్వం పోటీల్లో రొక్కల లిఖిత తృతీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, వారి గైడ్ టీచర్ సుబ్బరాజును, ఎంఈవో-2 గొర్రెల బాలయ్య, హెచ్ఎం పీవీ సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్ దేవి, సర్పంచ్ సాయి ప్రియ, ఉపసర్పంచ్ రుద్రరాజు కొండయ్య తదితరులు అభినందించారు.

ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలి

భీమడోలు: భీమడోలు సచివాలయం- 2లోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చిన నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, ప్రజాప్రతినిధులకు అధికారులు తగిన గౌరవం ఇవ్వాలని భీమడోలు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. దీనిపై భీమడోలులో ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుచూపుతోనే గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసారన్న విషయం గుర్తించుకోవాలని కోరారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో సచివాలయం-2లోకి మార్చడం శుభపరిణామన్నారు. అయితే కార్యాలయాన్ని ప్రారంభించిన తరుణంలో ప్రజాప్రతినిధులను పిలవకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులంతా వైఎస్సార్‌సీపీ వారే కావడం వల్లే ఆహ్వానించలేదని ఆయన అన్నారు.

అంధ, మూగ విద్యార్థులను ఆదుకోవాలి

దెందులూరు: అంధ, మూగ విద్యార్థులను దాతలు ఆదుకోవాలని పలువురు వక్తలు అన్నారు. గోపన్నపాలెం గ్రామానికి చెందిన దాత, వ్యాపారవేత్త కొండేటి మనోహర్ అంధ, మూగ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని గోపన్నపాలెం బాల ఆంజనేయస్వామి కమిటీసభ్యులు అన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు వంగాయగూడెం, ఏలూరు, వేగవరంలో అంధ, మూగ పేద విద్యార్థులకు అన్న వితరణ చేయడం మరెందరికో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ సందర్భంగా ఆదివారం దాత మనోహర్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

సామాన్యుడిపై 'ధరా'భారం

- బెంబేలెత్తిస్తున్న కూరగాయల రేట్లు
- అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలు
- ఏమీ కొనలేం, ఏమీ తినలేమంటున్న జనం
- సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆందోళన



భీమడోలులోని కూరగాయల దుకాణం

భీమడోలు: కూరగాయాలు, నిత్యావసర ధరల మోత మోగుతోంది. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కూరగాయాల ధరలు కొనుగోలుదారులకు షాక్ కొడుతున్నాయి. జేబునిండా డబ్బులు వేసుకుని వెళ్లి కూరగాయాలు కొనుగోలు చేసినా సంచి నిండని పరిస్థితి. పేద కుటుంబాలు కూరగాయాలు, నిత్యావసరాలు కొనలేక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండే ఎండలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల కూరగాయాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూన్ ప్రారంభంలో రెండున్నర కేజీల ఉల్లి రూపాయలు రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.150 పలుకుతోంది. ప్రతి ఇంట్లో నిత్యావసరమైన ఉల్లి ధరను నియంత్రించకపోవడంతో కొనుగోలుదారులకు కంటతడి పెట్టిస్తోంది. ఇదే సాకుతో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి మరీ ధరలు పెంచేస్తున్నారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రతి రోజు లాభంకన్నా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని చిన్న వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్న రోజు వారీ కార్మికులకు ఈ ధరలు మరింత షాక్ కొడుతున్నాయి. వారానికి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేసుకోవాలంటే రూ.1000 వెచ్చించాల్సిందే. మునుపెన్నడూ లేనివిధంగా కూరగాయల ధరలు పెరగడంతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా పండించిన కూరగాయలు సైతం రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయాల ధరలకన్నా చికెన్ ధరే తక్కువగా ఉందని పలువురు అంటున్నారు. ధరలను అదుపు చేయడంతో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు విమర్శిస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకులు పెరిగిన ధరలతో వంట చేయాలంటేనే భయపడిపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిర్వహణ ఖర్చుకు వాస్తవ ఖర్చుకు పొంతన లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

పండుగల వేళ నిత్యావసర ధరల భారం

దసరా పండుగ నేపథ్యంలో నిత్యవసర ధరలు పెరగడంతో సామాన్యులు భగ్గుమంటున్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో ధరలకు మరింత రెక్కలు వచ్చాయి. దీనితో ప్రజలు పిండి వంటలు చేసుకోవాలంటే అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వంట నూనె ధర రూ.123 నుంచి రూ.160 వరకు పలుకుతోంది. ఒక్కసారిగా వంట నూనె ధరలు లీటర్‌పై రూ. 30 నుంచి రూ.40వరకు పెరిగింది. వెల్లుల్లి ధర రూ.300 నుంచి రూ.410 వరకు పలుకుతోంది. కందిపప్పు ధర రూ.150 నుంచి రూ.175 వరకు, ఎండుమిర్చి రూ.200, మినపప్పు రూ.135కి చేరింది. పండుగ వేళ ప్రభుత్వాలు మండల కేంద్రాల్లో రేషన్ దుకాణాలు, రైతు బజార్లను ఏర్పా టు చేసి ప్రజలకు ఉల్లిపాయలు, వంట నూనెలు గిట్టుబాటు ధరకు విక్రయించాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలను నియంత్రించాలి



పనుల్లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలీల చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి ఏర్పడింది. మరో పక్క రోజు రోజుకూ పెరిగిపోతున్న కూరగాయలు, నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ధరలను ప్రభుత్వాలు అదుపులోకి తేవాలి.

– ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీ, భీమడోలు

కూరగాయల వ్యాపారంలో నష్టం



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. వాతావరణ పరిస్థితుల వల్ల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీనితో మార్కెట్‌కు వచ్చే సరుకు తగ్గడంతో రేట్లు పెరిగాయి. ఈ రేట్లతో కూరగాయాలు అమ్మడం కష్టంగా మారింది. రోజూ పెట్టుబడిలో కొంత నష్టం వాటిల్లుతోంది.

– చిలుకూరి బుజ్జీ, కూరగాయల వ్యాపారి, భీమడోలు

కూరగాయల ధరలు	(కిలో)
ఉల్లిపాయలు	రూ.60
నాటు చిక్కుళ్లు	రూ.120
పండుమిర్చి	రూ.100
ఆగాకర కాయ	రూ.120
చింతపండు	రూ.100
బీన్స్	రూ.120
ఆనపకాయ (ఒకటి)	రూ.40
చిలకడ దుంప	రూ.100
కాలీఫ్లవర్ పువ్వు	రూ.50
పెండ్లం	రూ.80
కొత్తిమీర కట్ట	రూ.40
తెల్ల వంకాయలు	రూ.60



దిగిరాని నాటు చిక్కుళ్ల ధర



ఘాటెక్కిన ఉల్లిపాయల ధరలు



వినియోగదారులకు మరింత ప్రియంగా మారిన వంట నూనెలు

లివర్ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం



బాధిత బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

దెందులూరు: చల్లచింతలపూడి గ్రామానికి చెందిన ముళ్లపూడి సుదర్శన్ కుమారుడు శరత్ కుమార్ కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి స్పందించిన చేయూత సభ్యులు బాధితుడు శరత్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడి మేనమామ మట్ట పెంటయ్యకు రూ.12 వేలు నగదు అందజేశారు. బాలుడు త్వరగా కోలుకోవాలని చేయూత సభ్యులు ఆకాంక్షించారు.

మానవత సేవలు విస్తృతం



మానవత మండల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రంగరాజు

ఉంగుటూరు: అక్టోబరు నుంచి సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు వెల్లడించారు. ఆదివారం నారాయణపురం మానవత మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగరాజు మాట్లాడుతూ ప్రధానంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి మాట్లాడుతూ సభ్యత్వాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాలేజీలు, హైస్కూళ్లలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మానవత డైరెక్టరు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పూర్వపు అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, వేగేశ్న సూర్యనారాయణరాజు, గురువెల్లి రాజారావు, కేనేసత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు నేదూరి గంగాధరరావు, సతీష్, రామిరెడ్డి వెంకటరెడ్డి, తాతారావు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే గుండె ఆరోగ్యం పదిలం



ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహించిన బీఆర్‌డీఏ నర్సింగ్ విద్యార్థులు

భీమడోలు: ఒత్తిడి లేని జీవన విధానం, వ్యాయామంతోనే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఏలూరు రితీష్ హార్ట్‌కేర్ ఆసుపత్రి కార్డియాలజీ డీఎం పి.రితీష్ అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ లింగంపల్లి నాగమణికంఠ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు విభాగాలను మణికంఠ, వైద్యులు రితీష్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.తేజస్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట సమయం నడక వ్యాయామం చేయాలన్నారు. ఆహార అలవాట్లను మార్చుకుని జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎల్. నాగమణికంఠ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పూళ్ల పరిసర గ్రామాలకు చెందిన 178 మందికి గుండె, కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 47 మందికి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. జిల్లా వైస్ చైర్మన్ తుమ్మూరు అంజనేయులు, జిల్లా కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, జిల్లా లీగల్ సలహాదారుడు మలిన శివకుమార్, కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.



పూళ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, జిల్లా చైర్మన్ లింగంపల్లి నాగమణికంఠ

గుండె జబ్బులపై అవగాహన అవసరం

దెందులూరు: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు నిషా, ప్రమీలారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలని, గుండె జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గుండెపోటు, గుండె జబ్బులను నివారించడం కోసం 1946లో జెనీవా దేశంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ ఏర్పాటైందని, 1999 నుంచి వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ లో ఆఖరి ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ దినోత్సవాన్ని 2011 నుంచి సెప్టెంబర్ 29న నిర్వహిస్తున్నారని అన్నారు.

ప్రజల ముందుకు సేంద్రియ ఉత్పత్తులు



ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల (కూరగాయల) దుకాణం

ఉంగుటూరు: సేంద్రియ, ప్రకృతి విధానంలో పండిస్తున్న కూరగాయలు ప్రజల ముంగిటకు వస్తున్నాయి. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ప్రోత్సాహంతో ఉత్పత్తుల స్టాల్‌ను ప్రతి సోమవారం సంబంధిత సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టాల్‌లో వివిధ రకాల కూరగాయలను అమ్మకానికి ఉంచుతున్నారు. ప్రజలు ఈ పంటల ఉత్పత్తులు కొనుగోలు చేసేలా చైతన్యపరుస్తున్నారు. ప్రకృతి విధానంలో పండించే పంట ఉత్పత్తులను తింటే ఆరోగ్యంగా జీవించవచ్చని అధికారులు, రైతులు చెబుతున్నారు. యాంకర్ సంధ్యారాణి పర్యవేక్షణలో నేచురల్ ఫార్మింగ్ వ్యవసాయానికి సంబంధించిన సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి అక్కడ ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసి రైతులను సేంద్రియ సాగు దిశగా ప్రోత్సహిస్తున్నారు. క్షేత్ర పర్యటన ద్వారా రైతులకు తగు సూచనలు సలహాలు ఇస్తున్నారు. నేచురల్ ఫార్మింగ్ విభాగంలో సుమారు పదిమంది వరకు మండలంలో పనిచేస్తున్నారు. వీరే ఉంగుటూరులో ప్రతి సోమవారం కూరగాయల దుకాణం ప్రభుత్వ కార్యాలయం ముందు ఏర్పాటు చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ తగదు



ఐక్యత చాటుతూ చేతులు కలిపిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనేక మంది విద్యార్థుల, యువకుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న నిర్వహించనున్న నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎస్ఎఫ్ఐ, ఐవైసీ, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్, పీఎస్ఎఫ్ఐ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, పీవైఎల్ జిల్లా నాయకుడు తగరం బాబురావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.లెనిన్, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆర్.సతీష్, వైఎస్ఆర్ ఎస్‌యూ నాయకుడు శివరావు, పీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం తన అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం కోసం ప్రైవేట్ పరం చేస్తోందని దీన్ని దీనిని అందరూ ఖండించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ చర్యను అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం పాటుపడతామని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీయమని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామి అయి ఉండి కూడా నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. తిరుపతి లడ్డూ గురించి గగ్గోలు పెట్టే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు వేలాది మందికి అన్నం పెట్టే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. ఈ నెల 28న నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలు తీసేస్తున్నట్టు ప్రకటించడం దుర్మార్గమని, వారందరినీ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేతతో ప్రయాణానికి ఇక్కట్లు



ఉంగుటూరు రైల్వేగేటు

ఉంగుటూరు: నిత్య రద్దీగా ఉండే ఉంగుటూరు రైల్వే గేటును రైల్వేశాఖ మూసి వేసింది. ఈనెల 28న మూసి వేసిన ఈ గేటును తిరిగి అక్టోబరు 5వ తేదీన తెరవనున్నారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా గేటు మూసి వేశారు. ఉంగుటూరు-నల్లజర్ల వెళ్లేందుకు ప్రధాన రహదారిగా ఈ మార్గం ఉపయోగపడుతోంది. ఉంగుటూరు ఎగువ ప్రాంతంలో ఉన్న ఎన్నో పరిశ్రమలకు వెళ్లే వాహనాలు పెరిగిపోవడం, అందులో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తారు. దీంతో నిత్యం ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రహదారిని ఆనుకుని ఉన్న సుమారు పది గ్రామాల ప్రజలు రైల్వే గేటును మూసివేయడంతో ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారు. ఉంగుటూరు గ్రామం కాలువకు ఇరువైపులా విస్తరించడంతో నిత్యం ప్రజలు గేటు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వారందరు గేటు మూసివేసిన కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో కుక్కల బెడద

ఉంగుటూరు: ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. ఉంగుటూరులో ఎంపీడీవో, తహసీల్దారు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయ భవనాలు ఒకే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాల ప్రారంగణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు ఆ కుక్కలను చూసి భయపడుతున్నారు. ఈ కార్యాలయాల చుట్టూ చెత్తా చెదారం పెరుకుపోయింది.తుప్పలు, పొద లు, గడ్డి పెరగడంతో పాములు సంచరిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పరిసరాలను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

యథేచ్ఛగా నాటు సారా విక్రయాలు

- గ్రామాల్లో ఏరులై పారుతున్న నాటు సారా
- పట్టించుకోని అధికారులు, పోలీసులు
- వసూల్ రాజాల అండతో యథేచ్ఛగా వ్యాపారం
- వెలవెలబోతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు



నాటు సారా కాస్తున్న దృశ్యం (ఫైల్)



విక్రయానికి భారీ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సారా (ఫైల్)

పెదవేగి : పెదవేగి మండలంలో నాటు సారా ఏరులై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నాటుసారా మితిమీరిన విక్రయాల వల్ల ప్రభుత్వ వైన్ షాపుల ఆదాయం లక్షల నుంచి వేలల్లోకి దిగజారిపోయిందని వైన్‌షాపు నిర్వాహకులు చెబుతున్నారు. రోజువారీ ఆదాయం చూసి వారు పెదవి విరుస్తున్నారు. నాటుసారాను అరికట్టవలసిన కొంతమంది అధికారులే వ్యాపారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సారా తయారీదారులు, గ్రామాల్లో అమ్మకందారుల నుంచి సారాను గ్రామాలకు డొంక దారుల ద్వారా రవాణా చేస్తున్నారు. రోజువారీ నుంచి నెలవారీ ముడుపులు తీసుకుంటున్న కొంతమంది అధికారులు మద్యం వ్యాపారాన్ని నష్టాల్లోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మద్యం వ్యాపారాన్ని నిలువునా ముంచేది కొంత మంది సివిల్, ఎక్సైజ్ పోలీసులేనని రాజకీయ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నాటు సారా విక్రయించే వారిని పట్టుకుని అరెస్ట్ చేయాలని, సారా అమ్మకందారుల నుంచి ముడుపులు తీసుకునే ప్రభుత్వ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్ని మండలాల్లో సారా వ్యాపారుల నుంచి మామూళ్ల వసూలుకు నమ్మకమైన వ్యక్తులకు వసూల్ రాజా విధులు అప్పగిస్తున్నారని మద్యం వ్యాపారులు అంటున్నారు. ఇదంతా జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో జరుగుతోందని విశ్వసనీయ సమాచారం. పెదవేగి మండలంలో తాళ్ల గోకవరం, రామసింగవరం, బాపిరాజుగూడెం, కొప్పాక, అమ్మపాలెం, భోగాపురం, వేగివాడ, అంకన్నగూడెం, కూచింపూడి, కె కన్నాపురం, కవ్వగుంటలో పట్టపగలే నాటు సారా నడి రోడ్డుపై బహిరంగంగా విక్రయిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఏలూరుకు స్పేస్ ఆన్ వీల్స్ బస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష మహాయాత్ర – స్పేస్ ఆన్ వీల్స్ బస్సు సోమవారం ఏలూరుకు వస్తోందని జిల్లా సమన్వయకర్త ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు ఇస్రో కార్యకలాపాలు, భారత అంతరిక్ష మిషన్ సమాచారాన్ని అందించడం కోసం ఈ వాహనాన్ని స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో అందుబాటులో ఉంచుతారన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ వాహనం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్పేస్ ఆన్ వీల్స్ వాహనంలో ఇస్రో నిర్వహించిన అంతరిక్ష యాత్రల సమాచారం, వివిధ ఉపగ్రహాల నమూనాలు, లాంచ్ ప్యాడ్స్ అంశాలు, ఇస్రో సాంకేతిక నిపుణులు విద్యార్థులకు వివరిస్తారు. ఈ మేరకు ఏలూరు పరిధిలోని ఆసక్తిగల పాఠశాలల, కళాశాలల విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా సమన్వయకర్త ఎస్.వెంకటేశ్వరరావును 81420 35942 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.